# పిన్ని

'వాణి'

—★—

'నాన్నా! నాన్నా!' మధురమైన పసికంఠం చల్లగాలికి డాబామీద తిరుగుతూన్న ప్రకాశరావును ఆలోచనలనుంచి మేల్కొలిపింది. ఐదేళ్ల పాప చేతిలోని లిల్లీ పూలను అతనికిచ్చి కాళ్లను పెనవేసుకుంది.

'ఈ పువ్వులెక్కడివి పాపా?' పాపనెత్తుకుంటూ అడిగాడు.

'నాజడలో గులాబీలు, యీ లిల్లీపూలు ప్రక్కింటి విమల పిన్ని యిచ్చింది నాన్నా! రోజూ రమ్మని, యిస్తాననికూడ చెప్పింది,' పాప ఉత్సాహంగా తండ్రి మొహంలోకి చూచింది.

'అలాగా!' అంటూ పాపతో కబుర్లు చెప్ప సాగాడు.

♦ ♦ ♦

విమల పల్లెటూళ్లో ఛాందసకుటుంబంలో పుట్టింది. అందుచేత పదిసంవత్సరాలకే వివాహం జరిగింది. పన్నెండేళ్ల విమల ప్రపంచాన్ని కొంచెంగా అర్థం చేసుకుంటూన్న తరుణంలో పసుపుకుంకుమలకు దూరమైంది. అర్థంకాని మూగబాధలో క్రుంగిపోయింది.

కొంతకాలానికి విమల తండ్రి పరంధామయ్య కొడుకుల చదువులకోసం బస్తీకాపురం పెట్టారు. తోటిపిల్లలంతా కేరింతలు కొడుతూ పుస్తకాలు పట్టుకొని బడికి వెళ్తూంటే విమలకు సరదాగాఉండేది. చదువుకోవాలనే ఉత్సాహం ఆమెలో ఉరకలు వేసింది. చివరకు ధైర్యంచేసి తన అభిప్రాయాన్ని తల్లికి తెలియజేసింది. వీలులేదని పరంధామయ్య ఉరిమాడు. కాని విమల పట్టుదలచూచి ఒప్పుకోక తప్ప లేదు. విమల అతిచురుగ్గా చదువుకోసాగింది. స్కూలు ఫైనలు మంచిమార్కులతో ప్యాసయింది. ఇంతలో హఠాత్తుగా పరంధామయ్య, భార్య వారంరోజుల వ్యత్యాసంలో మరణించారు.

విమల అన్నయ్యలు చదువుకున్నా సంస్కారం యేకోశానా లేదు. ఉద్యోగంచేసుకొని తన్ను తాను పోషించుకుందామనే విమల ఉద్దేశాన్ని తీవ్రంగా ఖండించారు. కుటుంబగౌరవానికి మచ్చవస్తుందని మూర్ఖంగా వాదించారు. ఇంటిపని యెగవేయడానికి యెత్తువేస్తూందని వదినెలు సణిగారు. తత్ఫలితంగా విమల విశ్రాంతిలేని పనికి అంకితమైంది. సంసారసౌఖ్యానికి, స్వేచ్ఛాజీవితానికి నోచుకోని తన దురదృష్టానికి కుమిలిపోయేది.

ప్రకాశరావు బ్యాంకు యేజంటు. పాపను పురిటిలోనే అతనికి అప్పజెప్పి భార్య కళ్లుమూసింది. తల్లి కాంతమ్మ ద్వితీయ వివాహం చేసుకోమని బలవంతపెట్టినా విరక్తుడై పాపను చూసుకుంటూ కాలం గడపసాగాడు.

ఆ ఊరికి క్రొత్తగా బదిలీ అయివచ్చిన ప్రకాశరావుకి విమల యింటిప్రక్కనే యిల్లు కుదిరింది.

ఒకనాటి సాయంత్రం మొక్కలకు నీళ్లుపోస్తూన్న విమల, 'పిన్నీ! నాకా పూవులియ్యవూ?' అన్న మధురస్వరం విని త్రుళ్లిపడింది. ముద్దులు మూటగట్టే ఐదేళ్లపాప నవ్వుతూ చూచింది. స్వచ్ఛమైన చనువు ఉట్టిపడే ఆ చిట్టిపాప సంబోధన ఆమెను తన్మయురాలిని చేసింది. పాపను దగ్గరకు తీసుకొని జడలో గులాబీలు పెట్టి లిల్లీపూవులిచ్చింది. పాపకు తల్లిలేదని తెలుసుకొని యెంతో బాధపడింది.

మొదటినించి విమల వదినెలతో స్నేహం చేసుకున్న కాంతమ్మకు విమలపై అకారణమైన ద్వేషం కలిగింది.

♦ ♦ ♦

'విమల దగ్గరకు వెళ్లడానికి వీలులేదు', పాపను కసురుతున్న కాంతమ్మ కంఠస్వరంవిని ప్రకాశరావు తెల్లబోయాడు,

'పాపకు సరదాగా ఉంటే వెళ్లనియ్యి! ఎవరు ప్రేమగాపిలుస్తే వారి దగ్గిరకే వెళ్లడం పిల్లల లక్షణం కదూ!" అన్నాడు.

'దాని దగ్గరకువెళ్తే పాప బాగుపడ్డట్టే!' కాంతమ్మ యీసడించింది.

'విమలచేసిన తప్పేమిటమ్మా?' అని ఆశ్చర్యంతో ప్రశ్నించాడు.

'మొగుడుపోతే, యింట్లో పనిచేస్తూ పడిఉండక

బోలెడు డబ్బు తగలబెట్టి చదివించి. ఉద్యోగం చేయటానికికూడ పూనుకోవడం యెంత సాహసమో చూడు! నిప్పులాంటి కుటుంబానికి కళంకం తేవడం కాదూ?' సబంధంలేని వ్యాఖ్యానం సాగించింది కాంతమ్మ. మాధవమ్మ కాలంతో, పూర్వీకంగా కాంతమ్మ మాట్లాడుతూంటే ప్రకాశరావుకి చికాకు వేసింది.

'భర్త పోయినంతమాత్రాన చాకిరీకి అంకితం కావాలనడం న్యాయం కాదమ్మా! ఉద్యోగం చేసుకోవాలని, అనుకోవడం గొప్పవిషయం. ఉద్యోగం చేయడంవలన వంశగౌరవానికి కొన్నడూ భంగం కలగదు. అయినా పాపంటే ఆమెకు యిష్టం. వెళ్తే తప్పేముంది?' అన్నాడు. తండ్రిమాటలు విన్న పాప చెంగున గెంతుతూ వెళ్లిపోయింది. కాంతమ్మ విసురుగా లోపలికి వెళ్లిపోయింది.

'పిన్నీ! పిన్నీ!' అని పిలుస్తూ లోపలికివెళ్లిన పాప జ్వరంతో మూలుగుతూన్న విమలనుచూచి నిలబడిపోయింది.

'రా పాపా!' హీనస్వరంతో అంటూ చేతులు చాచింది. పాపతల్లో పువ్వులుపెట్టి బుగ్గలు నిమిరింది.

'మందు త్రాగుతున్నావా పిన్నీ?' పాప అడిగింది. ఎన్నడూ అటువంటి ఆదరపూర్వకమైన మాటలు వినియెరుగని విమలకు ఆ మాటలు యెంతో సంతోషాన్ని కలిగించాయి.

'నేను చచ్చిపోతే నన్ను జ్ఞాపకం పెట్టుకుంటావా పాపా?' అని అడిగింది అప్రయత్నంగా.

'ఊహుఁ! నువ్వు చచ్చిపోవు పిన్నీ! మందు త్రాగితే జ్వరం తగ్గిపోతుందిగా!' అన్నది పాప.

'నేనంటే నీకెంత ప్రేమ పాపా!' అంటూ వెఱ్ఱి ఆనందంతో పాపను గుండెలకదుముకుంది. కొద్దిరోజులకే ప్రకాశరావుకి బదిలీ అయిపోయింది. పాప విమలతో చెప్పాలని ఉబలాటపడింది. కాని కాంతమ్మ వెళ్లనీయలేదు. విమల పాపరాకకోసం నిరీక్షించి నిరాశచెందింది. టేబిలుమీద దండలుకట్టి ఉంచిన పువ్వులు వాడిపోయాయి.

◆ ◆ ◆

క్రమంగా విమల జీవితం మరీదుర్భరం కాసాగింది. పోషించడం కష్టంగా ఉన్నదని, పని సరిగా చేయడంలేదని వదినెలు సాధించసాగారు. అన్న క్షమా కలుగజేసుకోలేదు. విమల మనశ్శాంతిలేక విసుగెత్తిపోయింది. ధైర్యంచేసి అన్నలతో వాదించి స్నేహితురాలి సహాయంతో టీచరు ట్రైనింగులో చేరింది. పుట్టింటి తలుపులు ఆమెకు బందయిపోయాయి. కాని ఆమె విచారించలేదు. తన హృదయంలో ప్రత్యేకస్థానాన్ని ఆక్రమించుకున్న పాపను మాత్రం మర్చిపోలేకపోయింది.

◆ ◆ ◆

జీవితంలో యిక కలుసుకోము అని అనుకున్న వ్యక్తులు తటస్థపడటం జరుగుతూ ఉంటుంది. అదే విధంగా ఒకరోజున స్కూలువిడిచాక పాపను తీసుకొని వెళ్లడానికివచ్చిన ప్రకాశరావు పాప ఒక స్త్రీచేయి పట్టుకొని రావడంచూచి విస్తుపోయాడు.

'విమలపిన్ని యిక్కడే ఉంది నాన్నా! మాపంతులమ్మకూడ అయింది', ముద్దుమాటలతో పరిచయం చేసింది. విమల తలెత్తి మొదటిసారిగా ప్రకాశరావునుచూచి చేతులు జోడించింది. అతని కళ్లలో గౌరవభావం తొణికిసలాడుతోంది. తీరని ఆవేదనను విశాలనేత్రాలతో దాచుకో ప్రయత్నిస్తున్న విమల ముఖం ప్రకాశరావును కదల్చివేసింది. తను క్రొత్తగా ట్రైనింగు అయివచ్చినట్లు, పాపను తిరిగి చూడగలగడం తనకెంతో సంతోషంగా ఉందనిచెప్పి సెలవు తీసుకుంది.

పాప యెక్కువసేపు విమలతోనే గడపసాగింది. ప్రకాశరావు ఆనందించాడు. కాని యిది కాంతమ్మకు సహించరానిదైంది.

'విమలతో పాపను తిరగనీయకు ప్రకాశం!' అన్నది ఒక రోజున.

'పాప ఆవిడను వదలి ఉండలేదు. అకారణంగా పాపను బంధించి బాధపెట్టటం నాకిష్టంలేదు,' అని చెప్పాడు.

ఒకసారి పాపకు జ్వరంవచ్చింది. వారంరోజుల వరకు పాపసంగతి తెలియక విమల గాభరాపడి చివరకు బయలుదేరి వెళ్లింది. మగతగా, నీరసంగా పడి ఉన్న పాపను చూచి నిర్ఘాంతపోయింది. విమల చల్లని స్పర్శతో పాపకళ్లు తెరచింది. 'పిన్నీ! నన్ను వదలివెళ్లకు!' అంటూ ఆమె ఒడిలో వాలిపోయింది. కన్నీళ్లతో విమల పాపనునిమిరింది. వీలున్నప్పుడు విమలవచ్చి పాపదగ్గరే ఉంటూ, శుశ్రూష చేయసాగింది. కాంతమ్మ కిష్టం లేక పోయినా అడ్డు చెప్పలేక పోయింది.

టైఫాయిడ్‌తో నెలరోజులు బాధపడిన పాప విమల సంరక్షణలో వేగంగానే తేరుకుంది. అప్పటికి విమల సద్వర్తనను కొద్దిగా అర్థం చేసుకుంటున్న కాంతమ్మ లోలోన సిగ్గుపడిపోయింది. పాప మామూలుగా బడికి వెళ్ళసాగింది.

ఆ నాడు పాప పుట్టినరోజు.

'నాన్నా! విమల పిన్నిని తీసుకురా!' అని మారాంచేసింది. ప్రకాశరావు బయలుదేరాడు.

గదిగుమ్మంలో నిలబడిన ప్రకాశరావు కృష్ణ విగ్రహానికి హారతినిస్తున్న విమలను తదేకంగా చూచాడు. ఏనాటినించో తెగనిసమస్య ఆక్షణంలో పరిష్కారమైనట్లు తోచింది. ప్రేమైక హృదయం కలిగిన విమల! తనభార్య అయితే మోడువారిన సంసారజీవితంలో ఆనందం చిగురిస్తుంది! ప్రకాశరావు యిక ఆగలేకపోయాడు. చటుక్కునవెళ్ళి పూజ పళ్ళెంలోని కుంకుమతీసి ఆమె నుదుట దిద్దాడు. విమల తెల్లబోయింది. మరుక్షణం వెక్కి వెక్కి యేడవ సాగింది.

'ప్రకాశరావుగారూ! మీరూ నన్ను అవమానం చేయాలని చూస్తున్నారా?' అన్నది గద్గదస్వరంతో. కుంకుమ చెరుపుకోబోతున్న విమలను ప్రకాశరావు వారించి చేయి పట్టుకున్నాడు.

'జీవితాంతం బాధతో కృశించడానికి నీవుచేసిన అపరాధమేమీ లేదు విమలా! అన్ని సౌఖ్యాలకు నీవూ అర్హురాలివే. నీపసితనంలో పెద్దలు చేసిన తప్పుకి నీవు శిక్షితురాలివి కానవసరంలేదు. పాప హృదయం నీకు తెలిసినదే! పాపకోసమైనా నాదానవు అయి నాయింట్లో సంతోషాన్ని వెలిగొల్పాలని నా ఆశయం. నీకిష్టంలేదా విమలా?' ప్రకాశరావు దీన స్వరం విమలను ద్రవింపజేసింది. తన జీవితం సఫలమయే శుభదినం వచ్చిందా? కాని కాంతమ్మకు తన యెదలగల కోపాన్ని తల్చుకొని కంపించింది.

'లోకందృష్టిలో సమంజసంగా ఉండదు ప్రకాశరావుగారూ! మీ అమ్మగారికి వ్యతిరేకంగా ప్రవర్తించడం భావ్యంకాదు', అన్నది.

'నాయిష్టానికి మా అమ్మ అడ్డం చెప్పదు. నీకు అంగీకారమైతే నాకెవరి లక్ష్యమూలేదు. లోకం కోసం నాపాపను అన్యాయం చేయను' అన్నాడు.

'ధన్యురాలిని', విమల పెదవులపై మందహాసం లాస్యంచేసింది. కుంకుమతో మెరుగులీనే ఆమె అందమైన ముఖంచూస్తూ ప్రకాశరావు తన్మయుడైనాడు.

రిజిష్ట్రారు ఆఫీసునించి యిద్దరూ యింట్లో అడుగు పెట్టేసరికి పాప నవ్వుతూ యెదురుగా వచ్చింది.

'నీకు పుట్టినరోజు బహుమతిగా పిన్నిని తీసుకొచ్చాను పాపా! ఇకమీదట పిన్ని మనయింట్లోనే ఉండిపోతుంది'. అన్నాడు ప్రకాశరావు. భక్తితో తన పాదాలకు నమస్కరిస్తున్న దంపతులను దీవించకుండా ఉండలేకపోయింది కాంతమ్మ.

విమల భుజాలపై చేతులువేసి కూర్చుని కిలకిల నవ్వుతూ కబుర్లుచెప్తూన్న పాపను, చిరునవ్వులు చిందిస్తున్న విమలనుచూస్తూ ప్రకాశరావు ఆనందభరితుడైనాడు.

